## జంట హత్యల కేసులో కోర్టు కీలక తీర్పు

**నిందితులకు జీవిత ఖైదు విధించిన న్యాయమూర్తి**


మట్టారెడ్డి


ఖాజా


భిక్షపతి

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 19 : మండల పరిధిలోని చర్లపటేల్‌గూడ సమీపంలో గతేడాది మార్చి ఒకటో తేదీన కలకలం రేపిన జంటహత్యల కేసులో నిందితులుగా గుర్తించిన మట్టారెడ్డి, ఖాజా, భిక్షపతిలకు రంగారెడ్డి జిల్లా కోర్టు జీవితఖైదు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. ఇబ్రహీంపట్నం మండలంలోని చర్లపటేల్‌గూడ సమీపంలో భూ తగాదాల్లో నవారు శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిలను నిందితులు మట్టారెడ్డి, భిక్షపతి, ఖాజాలు రివాల్వర్‌తో కాల్చి చంపారు. అప్పట్లో ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ మేరకు గురువారం కోర్టు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఇబ్రహీంపట్నం సీఐ గోవింద్‌రెడ్డి తెలిపారు.

## బాలికకు ప్రేమ వేధింపులు

**పోక్సో చట్టం కింద కేసు.. యువకుడికి రిమాండ్**


సయ్యద్ అబ్బాస్

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 19 : ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేయడంతో పాటు ఆమె తండ్రిని బెదిరించి దాడి చేసిన యువకుడు కటకటాల పాలయ్యాడు. అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ కథనం ప్రకారం.. తారామతిపేటకు చెందిన సయ్యద్ అబ్బాస్ అలీ అనే యువకుడు ప్రేమ పేరుతో అదే మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక వెంట పడ్డాడు. విషయం బాలిక తల్లిదండ్రుల వరకు వెళ్లింది. దీంతో అబ్బాస్‌ను మందలించారు. ఇది మనసులో పెట్టుకున్న అబ్బాస్ బుధవారం బాలిక తండ్రి హయత్‌నగర్ వైపు వెళ్తుండగా.. ఆయన వాహనాన్ని బైక్‌పై వచ్చి ఢీకొట్టాడు. ఆపై తన తమ్ముడితో కలిసి బాలిక తండ్రిని బెదిరించి, దాడి చేశాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి, బెదిరింపు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మన్మోహన్ తెలిపారు. నిందితుడు అబ్బాస్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ కోసం కోర్టులో హాజరు పరిచినట్టు చెప్పారు.

## కిరాణా షాపులో అక్రమ మద్యం


స్వాధీనం చేసుకున్న మద్యం

పెద్దఅంబర్‌పేట, అక్టోబర్ 19 : కిరాణా దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ కథనం ప్రకారం.. ఇస్లావత్ బాలు అనే వ్యక్తి అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో కిరాణా దుకాణం నడుపుతున్నాడు. అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు చేశారు. రూ.11,411 విలువైన 73 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు మన్మోహన్ తెలిపారు.

## ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలి


మాట్లాడుతున్న వికారాబాద్ డీఎస్పీ

నవాబుపేట, అక్టోబర్ 19 : నిబంధనలను పాటిస్తూ అన్ని పార్టీల నాయకులు ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలని వికారాబాద్ డీఎస్పీ నర్సింహులు అన్నారు. నవాబుపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం వివిధ పార్టీలకు ఎన్నికల నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకునే ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. రూ.50వేలకు మించి నగదును ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లరాదన్నారు. కార్యక్రమంలో సీఐ ఆంజనేయులు, ఎస్సై భరత్ భూషణ్, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**రాజకీయ పార్టీలకు అవగహన**

దౌల్తాబాద్ : మండలంలోని బిచ్చల్ గ్రామంలో గురువారం కొడంగల్ సీఐ రాములు అధ్వర్యంలో రాజకీయ పార్టీ నాయకులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఎన్నికల నిబంధనలపై సీఐ రాములు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఈ నిబంధనలను పాటించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రమేశ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వాహనాల తనిఖీ

- ■ చెక్‌పోస్టుల వద్ద నిఘా పెంచిన పోలీసులు
- ■ ముఖ్య కూడళ్లలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- ■ 24 గంటలపాటు నిరంతర గస్తీ



యాచారం మండలం మాల్‌లో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

యాచారం, అక్టోబర్ 19 : ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు, మద్యం ఇతరత్రా తరలించే వారిపై నిఘాను పెంచారు. ముఖ్య కూడళ్లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటల పాటు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మండలంలో వాహనాల తనిఖీలను పోలీసులు మరింత ముమ్మరం చేశారు. జిల్లా సరిహద్దు ప్రాంతమైన మండలంలోని మాల్ మార్కెట్‌లో నాగార్జునసాగర్ రహదారిపై పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. గురువారం నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. కార్లు, జీపులు, క్రూయిజర్లు, ఆటోలు, ట్యాక్సీలు, డీసీఎంలు, ట్రాలీ ఆటోలు తదితర ప్రైవేట్ వాహనాలను చెక్ చేస్తున్నారు. వాహనాలలో డబ్బులు, ఇతర వస్తువులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని పూర్తి స్థాయిలో తనిఖీ చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

**రూ.4.10లక్షల నగదు పట్టివేత**

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా రూ.4 లక్షల 10వేల నగదును గురువారం పట్టుకున్నారు. సీఐ సైదయ్య తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలో ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా మల్కీజ్‌గూడ గ్రామానికి చెందిన రమేశ్ నుంచి రూ.4 లక్షల 10వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ డబ్బును సీజ్ చేసి డీటీవోలో డిపాజిట్ చేసినట్లు ఆయన తెలిపారు. లెక్కకు మించి నగదును, బంగారాన్ని తరలిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

### చేగూరులో రూ.5 లక్షలు పట్టివేత



తనిఖీల్లో దొరికిన డబ్బును చూపిస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

కొత్తూరు : ఎన్నికల కోడ్‌లో భాగంగా రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చేగూర్ రోడ్డు వద్ద గురువారం జరిగింది. కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి చేగూర్ వైపు వెళ్తున్న కారును కొత్తూరు పోలీసులు తనిఖీ చేయగా రూ.5 లక్షలు దొరికాయి. ఓనర్ నవనీత్ ఆగర్వాల్ ఆ డబ్బుకు ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకొని ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారికి పంపామని సీఐ శంకర్‌రెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఎస్సై శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వర్తించాలి

■ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ■ ఇబ్రహీంపట్నం, మంచాలలో పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఆరుట్లలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్న/మంచాల అక్టోబర్ 19 : పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఓసీ కమ్యూనిటీ హాల్ పోలింగ్ కేంద్రాన్ని, మంచాల మండలంలోని నోముల, ఆరుట్ల పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. కేంద్రాల్లో ఉన్న వసతులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, దివ్యాంగులకు వీల్‌చైర్లు, ర్యాంపులు వంటి అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఆమె వెంట ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కాశీవిశ్వనాథ్, అధికారులు పాల్గొన్నారు.

## నిందితులు క్రమశిక్షణతో మెలగాలి


నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

పెద్దేముల్, అక్టోబర్ 19 : రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వివిధ కేసుల్లో నేరారోపణలు ఉన్న నిందితులు క్రమశిక్షణతో మెలగాలని తహసీల్దార్ కిషన్ సూచించారు. గురువారం పలు గ్రామాలకు చెందిన ముగ్గురు నిందితులను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నిందితులు ఎలాంటి గొడవలు, బెదిరింపులకు పాల్పడకుండా క్రమశిక్షణతో ఉండాలన్నారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రూ.లక్ష జరిమానాను విధించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు మండల పరిధిలోని ఆత్కూర్‌కు చెందిన ప్రభాకర్, నాగులపల్లికి చెందిన హన్మంతు, పెద్దేముల్‌కు చెందిన వినయ్‌లను బైండోవర్ చేయగా వారికి తహసీల్దార్ పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శివ చంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకునేందుకు కృషి

షాబాద్, అక్టోబర్ 19 : గ్రామంలోని పేద ప్రజలను ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బోరాంచ రాంచంద్రారెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండలంలోని చిన్న సోలీపేట్‌లో అదే గ్రామానికి ఎండీ షరీఫ్ కూతురు వివాహానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తున్నదన్నారు. గ్రామంలో ఎవరైనా ఆడబిడ్డల పెండ్లిళ్లు చేస్తే తన వంతుగా రూ.10వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోరాంచ రమ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు బండారి దేవేందర్ యాదవ్, గ్రామస్తులు తదితరులున్నారు.

## వైభవంగా శరన్నవ రాత్రి ఉత్సవాలు


మైసిగండిలో అమ్మవారిని దర్శించుకున్న ఈవో స్నేహలత, భక్తులు

కడ్తాల్, అక్టోబర్ 19 : మండలంలో విజయదశమి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఐదో రోజు మైసిగండిలో కొలువైన అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా, మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో లలితాత్రిపురరాసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఈవో స్నేహలత, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, యాదగిరిస్వామి, కృష్ణ, రాములు, దేవేందర్, చంద్రయ్య, రామకృష్ణ, వెంకటేశ్, హర్షవర్ధన్, భక్తులు పాల్గొన్నారు.